క్లుప్తంగా

200 మందికి ఉచిత వైద్యసేవలు



పెడన: పట్టణంలోని 18వ వార్డు కమ్యూనిటీ హాల్లో ఆదివారం లివింగ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్, బాబులాల్, వైఎస్సార్ సీపీ నేత కోమట్ల అనిల్‌కుమార్ తదితరులు ప్రారంభించారు. హెల్ప్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సేవలను అందించారు. సుమారు 200 మందికి పైగా ఓపీ చూపించుకున్నారు. అవసరమైన వారికి ఎకో, ఈసీజీలు తీసి ఉచితంగా మందులను అందజేశారు. ఫాదర్ సాల్మన్‌రాజు(మహాలక్ష్ముడు), పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాలకేంద్రం నూతన భవనం ప్రారంభం



పెడన: చెన్నూరు గ్రామంలో పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘ పాల కేంద్రం నూతన భవనాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. ఆదివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. యూనియన్ పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా పాలక వర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్, పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, చెన్నూరు సర్పంచ్ వేముల చంటి, సంఘ అధ్యక్షుడు అచ్యుత నాగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరుడి ఆలయం ఆధ్వర్యాన గోమాతకు సీమంతాన్ని ఆదివారం ఆత్మీయ సంప్రదాయంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతుల సంరక్షణలో ఉన్న ఆవు లక్ష్మికి ఏడు నెలల సూడి నిండిన సందర్భంగా సీమంత కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ అర్చకుడు శ్రీహరి బ్రహ్మత్వంలో నిరంజనరావు దంపతులు, గ్రామంలోని మహిళలు సంప్రదాయ రీతిలో గోమాత సీమంతం పూజలు జరిపారు. గతంలో ఆవును ఆలయానికి దానం చేసిన దాత గువ్వబత్తుని కేశవరావు, సీతారావమ్మ దంపతులు, భక్తులు, గ్రామ ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



మచిలీపట్నంటౌన్: స్థానిక శ్రీ సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం శ్రీ సత్యసాయి అమృతకలశ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ పర్యవేక్షణలో 29 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు శ్రీ సత్యసాయి అమృత కలశం పేరిట అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు బి.కాళికాదేవి, కె.నాగమణి, పి.విశాలాక్షి, ఎస్.లక్ష్మీభాయి, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

డీవైఈవో సుబ్బారావుకు ఘన సత్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఉప విద్యాశాఖాధికారిగా పని చేస్తున్న వీవీ సుబ్బారావు సేవలు మరువలేనివని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో డీవైఈవోగా పనిచేస్తూ ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారిగా పదోన్నతిపై బదిలీ కావడంతో ఆయనకు ఆదివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఇంటి ముంగిటకే సాంకేతిక పరిజ్ఞానం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉల్లిపాలెంలో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ప్రతి పల్లెలో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ నిర్మాణం ద్వారా ఇంటి ముంగిటకే సాంకేతిక పరిజ్ఞానం చేరువైందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని ఉల్లిపాలెం సచివాలయ పరిధిలో రూ.16 లక్షల అంచనాతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీని రమేష్‌బాబు ఆదివారం ప్రారంభించారు. సర్పంచి పావని అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రస్తుతం వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలతో సాంకేతిక పరిజ్ఞానం పల్లె ప్రజలకు మరింత దగ్గరైందన్నారు. డిజిటల్ లైబ్రరీల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ కనెక్షన్, వివిధ రకాల పోటీల పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంటాయన్నారు. వర్క్ ఫ్రం హోం ద్వారా ఉద్యోగం చేసేవారు కూడా ఇంటర్నెట్‌ను వినియోగించుకొనేలా లైబ్రరీల్లో వసతులు కల్పిస్తున్నట్లు రమేష్‌బాబు చెప్పారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీటీసీ సనకా శైలజ, పార్టీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, బీసీసెల్ కన్వీనర్ చేబోయిన కృష్ణారావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, మత్స్యకార నేత చిలకలపూడి ధర్మయ్య, వెర్రీ శ్రీనివాసరావు, ఈడ యలవర్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయాలి



రేపల్లె శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

అవనిగడ్డ: సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సూచించారు. అవనిగడ్డ పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ సొసైటీలను బలోపేతం చేయడానికి, రైతులకు మరిన్ని సేవలందించడానికి నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటే ఇంతకంటే మరిన్ని మంచి పథకాలు అమల్లోకి తెస్తారన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ మండల కన్వీనర్‌గా పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లుగానే సొసైటీ చైర్‌పర్సన్‌గా పీఏసీఎస్ అభివృద్ధికి రేపల్లె కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రేపల్లెని ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లుతో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఏఎంసీ, చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నా, మోపిదేవి మండల కన్వీనర్ గరికపాటి వెంకటేశ్వరరావు, కొత్తపేట పీఏసీఎస్ చైర్మన్ బడే వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు నరేష్, గణేష్, లంకమ్మ అమ్మవారి ఆలయ ట్రస్ట్ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 8, 9, 50 డివిజన్లలో పలు అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ మూడు డివిజన్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ. 20 లక్షల చొప్పున నిధులతో పక్కా డ్రెయిన్లు, సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. 8వ డివిజన్ విశ్వబ్రాహ్మణ కాలనీలో, 10వ డివిజన్ సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ ఎదురుగా ఉన్న పార్కు వద్ద, 50వ డివిజన్ టెంపుల్‌కాలనీ ఆంజనేయస్వామి గుడి వద్ద పనులను ప్రారంభించారు.

డివిజన్లలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందని కిట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, 8, 9, 50 డివిజన్ల కార్పొరేటర్లు శ్రీరాం చిన్నా, రాసంశెట్టి వాణిశ్రీ, మరీదు రాటాలమ్మ, కార్పొరేటర్లు ఏకశిరి వెంకటేశ్వరరావు, చిత్తజల్లు ప్రసన్న, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కమిషనర్ బాపిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



ఉపాధ్యాయులతో సంఘ నేతలు

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పులగం వెంకటేశ్వరావు అన్నారు. నూతనంగా ఏర్పడిన మండల ఎస్టీయూ శాఖ రెండు రోజుల పాటు పలు పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న నూతన విద్యావిధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివిసీమలో శాఖకు మంచి స్పందన వచ్చిందని 55 మంది ఉపాధ్యాయులు తమ సభ్యత్వాలను కూడా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎస్టీయూ ప్రధాన కార్యదర్శులు మండవ శ్రీనివాస్, పీకా ఇమ్మానియేల్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి నివాళి



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: ఇటీవల మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న అవార్డు ప్రకటించడంతో నగరంలోని పార్కు వద్ద ఉన్న పీవీ విగ్రహానికి ఆదివారం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువాడైన పీవీ నరసింహారావుకు భారతరత్నను ప్రకటించడం తెలుగువారికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కమిషనర్ బాపిరాజు, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు ఆర్వీఎస్ మురళీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ ట్రిపుల్ జంప్‌లో జగదీష్‌కు రజతం



రజత పతకం, సర్టిఫికెట్ అందుకుంటున్న జగదీష్‌కుమార్

టి.కొత్తపాలెం(నాగాయలంక): మండలంలోని టి.కొత్తపాలెం శివారు మరియపురం గ్రామానికి చెందిన వెటరన్ క్రీడాకారుడు తూము జగదీష్ కుమార్ ట్రిపుల్ జంప్‌లో రజత పతకం సాధించారు. ఈ నెల 8వ తేదీ నుంచి 11వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ నేషనల్ ఛాంపియన్–2024 పోటీల్లో 70ప్లస్ వయసు కేటగిరీలో ఆయన ఘనత సాధించారు. పతకం పొందిన జగదీష్ రోజూ మరియపురం నుంచి నాగాయలంక హైస్కూలు గ్రౌండ్స్‌కు వచ్చి వాకింగ్, వ్యాయామం చేస్తుంటారు. బీపీడీ, ఎంపీడీ శిక్షణ పొందిన ఆయన జిల్లా విద్యాశాఖలో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. పలువురు ఆయనను అభినందించారు.

మల్లవోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పురస్కారం అందుకుంటున్న మల్లవోలు విద్యార్థులు

గూడూరు: విప్రో ఎర్తెయిన్ పోటీల్లో గూడూరు మండలం మల్లవోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వ్యర్థాల నిర్వహణ అనే అంశంపై పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు దేవిప్రియ, మౌనిక, లహరి సంయుక్తంగా రూపొందించిన ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.అరుణ తెలిపారు. శనివారం అమరావతిలోని ఏపీ విద్యా పరిశోధన పిక్‌నిక్ సంస్థలో సంస్థ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులు బహుమతులందుకున్నారు. పురస్కారం అందుకున్న పాఠశాల విద్యార్థులతో పాటు గైడ్ చేసిన పీఈటీ ఎస్.శ్రీనివాస్, ఎన్.అరుణను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.నరసింహారావు, వైస్ చైర్మన్ ప్రశాంతి తదితరులు అభినందించారు.

రూ.2 కోట్లతో పాఠశాల భవనాలకు శంకుస్థాపన



శంకుస్థాపనలో బౌద్ధ గురువు, నిర్వాహకులు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలలో రూ.2 కోట్లతో నిర్మించనున్న గొర్రెపాటి వెంకట్రాయలు, ఉదయభాస్కరమ్మ పాఠశాల భవనాలను బౌద్ధ గురువు బంతేజీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథబాబు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ జీవీ రామకృష్ణ, రిటైర్డ్ హెచ్ఎం లోయ నాగేశ్వరరావు, విద్యాట్రస్ట్ సభ్యులు కొండపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య సంకీర్తనోత్సవం



అన్నమాచార్య సంకీర్తనలు ఆలపిస్తున్న గాయనీమణులు

మచిలీపట్నంటౌన్: శ్రీ తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనోత్సవం సంగీత ప్రియులకు వీనుల విందు చేసింది. నగరంలోని చిట్టిపిళ్లారయ్య స్వామి దేవస్థానం ఆవరణలోని శృతిసౌరభం వేదికపై ఆదివారం శ్రీ అన్నమాచార్య సంగీత సభ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గాయనీ, గాయకులు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ఉదయం సప్తగిరి సంకీర్త నమాల బృందగానం, సంకీర్తనార్చన నిర్వహించారు. పలు అన్నమాచార్య కీర్తనలను శ్రవణానందంగా ఆలపించారు. సాయంత్రం అన్నమయ్య చరితం అనే సంగీత నృత్యరూపకాన్ని గుడివాడకు చెందిన పాదర్తి సిస్టర్స్ శిష్యబృందం ప్రదర్శించారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

పామర్రు: పామర్రు పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు దాత బొమ్మారెడ్డి మాధవరెడ్డి సౌజన్యంతో ఆదివారం చీరల పంపిణీ చేశారు. స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో కార్యక్రమం జరిగింది. దాత మాధవరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని పేదలకు చీరలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, విజయవాడ కృష్ణా మిల్క్‌యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, మండల సచివాలయ అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన బలరామ్‌కు సన్మానం

పెడన: పెడన పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.బలరామ్‌కు ఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించింది. ఆయన ఆదివారం విధుల నుంచి రిలీవ్ అయి కాకినాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్ఐ సూర్యశ్రీనివాస్‌తో పాటు ఎస్ఐ –2 సత్యనారాయణ, ఏఎస్ఐ టి.సురేష్, స్టేషన్ సిబ్బంది తదితరులు బలరామ్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలో 40వ డివిజన్‌లోని 11వ క్లస్టర్‌లో ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ తరకటూరి సీతారాముడు ఆధ్వర్యాన గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కార్డులను అందజేశారు. రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించారని తెలిపారు.

అపరాల సాగులో అధిక దిగుబడికి ప్రాధాన్యం

నాగాయలంక: అపరాల సాగులో దిగుబడి కీలకమని, పంటలో అధికంగా పూత రావడానికి, వచ్చినది రాలిపోకుండా చూసుకోవడం ప్రధానమని పురుగుమందుల కంపెనీ ఇండోఫిల్ కంపెనీ స్టేట్‌హెడ్ మనోహర్‌రెడ్డి చెప్పారు. కంపెనీ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో అపరాల సాగులో దిగుబడి పెంపుదల చర్యలపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. సంస్థ సేల్స్ ఆఫీసర్ మణికంఠ, బండి టాగూర్, ఏరియా డిఈఒ కొండవీటి సురేష్, సిబ్బంది, మండల రైతులు పాల్గొన్నారు.

రామరాజుపాలెం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

గూడూరు: మండల పరిధిలో రామరాజుపాలెం గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ కె.ఈశ్వరరావు(28) ఆదివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈశ్వరరావు మరణించడంతో పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చెత్త నుంచి సంపద ఉత్పత్తి చేయాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సలహాదారు శ్రీనివాసన్

చల్లపల్లి: ప్రతి గ్రామ పంచాయతీ తమ డంపింగ్ యార్డులో సంపద ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్, పర్యావరణవేత్త వేలేరు శ్రీనివాసన్ కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డులో ఆదివారం సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా చెత్త విభజన చేశారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్ – డాక్టర్ టి.పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ కార్యకర్తలు, మనకోసం మనం ట్రస్ట్ సిబ్బంది, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కలిసి డంపింగ్ యార్డులో డ్రై లీవ్స్ కంపోసిట్ పిట్ ఏర్పాటు చేశారు. పొడి చెత్త నుంచి ప్లాస్టిక్, పేపర్ వేరు చేసి ఆకులు, ఇతర వ్యర్థాలతో ఈ పిట్ ఏర్పాటు చేశారు. ఇలాంటి వాటితో గ్రామ పంచాయతీకి ఆదాయం లభిస్తుందని శ్రీనివాసన్ తెలిపారు. మూడు రోజులుగా డంపింగ్ యార్డ్‌లో స్వచ్ఛందంగా చెత్త విభజనలో భాగస్వాములవుతున్న వైద్యులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, సీనియర్ సిటిజన్స్, కార్మికులు ప్రతి ఒక్కరూ ఆదర్శనీయ పాత్ర పోషించారని శ్రీనివాసన్ ప్రశంసించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్వచ్ఛ కార్యకర్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహానికి బియ్యంతో అభిషేకం చేస్తున్న చైర్మన్ సాంబశివరావు, భక్తులు

నాగాయలంక: శ్రీకన్యకాపరమేశ్వరి 4641వ ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయ కమిటీ, వాసవీ సేవాదళ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వేడుక నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో తొలుత అమ్మవారి ఉత్సవ మూర్తి సమేతంగా 102 బిందెలతో కృష్ణానదికి తరలి వెళ్లారు. ఆర్యవైశ్య మహిళలు, యూత్‌సభ్యులు అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో నదీమతల్లికి పూజలు జరిపారు. తొలుత ఉత్సవమూర్తికి 108 బిందెల కృష్ణా జలాలు, ఆ తర్వాత 108 కేజీల కొత్త బియ్యంతో భక్తులు స్వయంగా అభిషేకించారు. అభిషేకం చేసిన కొత్త బియ్యంతో 500మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు తాడికొండ సత్యనారాయణ, జయలక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రధాన పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు చిట్టా పూర్ణచంద్రరావు, సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, మునగాల మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో రాష్ట్రం మరింత అభివృద్ధి

ప్రజాదీవెన యాత్రలో ఉప్పాల రాము



చినగొల్లపాలెం ప్రజాదీవెన యాత్రలో ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

కృత్తివెన్ను: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మీరంతా జగనన్నకు అండగా నిలవాలని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఆయన్ను మరో మారు ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలసి ఆదివారం మండల పరిధిలోని చినగొల్లపాలెం దీవిలో ప్రజాదీవెన యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గృహాన్ని సందర్శించి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరించారు. భవిష్యత్తులో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే మీరంతా జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు.

రూ. 30 లక్షలతో రోడ్డు పనులు

చినగొల్లపాలెం–కాశీపట్నం వారధి నుంచి రూ. 30 లక్షల జెడ్పీ నిధులతో 620 మీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలను కలిపే వారధికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో వాహనచోదకులు అవస్థలు ఉండవని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ సునీల్, స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

శుభలేఖలు పంచేందుకు వెళుతూ మృత్యుఒడికి

కొమిరేపల్లి వద్ద టిప్పర్‌ను ఢీకొని మచిలీపట్నం వాసి మృతి

దెందులూరు: శుభలేఖలు పంచేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు ఓ వరుడు. దెందులూరు ఎస్సై స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మచిలీపట్నానికి చెందిన షేక్ ఫరీద్ (23)కు వివాహం నిశ్చయమైంది. శుభలేఖలు ఇచ్చేందుకు మచిలీపట్నం నుంచి నిడదవోలుకు బుల్లెట్‌పై బయలుదేరాడు. కొమిరేపల్లి వద్దకు వచ్చేసరికి రాజమండ్రి వైపు వెళుతున్న కారును టిప్పర్ ఢీకొంది. ఘటనతో టిప్పర్‌ను జాతీయ రహదారి మధ్యలో నిలిపివేశాడు. ఆ సమయంలో వెనుక నుంచి వస్తున్న షేక్ ఫరీద్ టిప్పర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. కారు, టిప్పర్ డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఫరీద్ మృతితో అత్తమామలు, తల్లిదండ్రులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గూడూరు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం పెడన సీఐ కె.నాగేంద్ర ప్రసాద్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని హెచ్చరించారు.